ఎమ్మెల్యే వ్యాఖ్యలపై దళిత సంఘాల నిరసన

- తురకపాలెం చెక్కుల పంపిణీ సభ వద్ద ఉద్రిక్తత
- అవమానించే విధంగా మాట్లాడొద్దని ఎమ్మెల్యేకు హితవు
- దళిత, ప్రజా సంఘాల ఉద్యమంతోనే రూ.5 లక్షలు నష్టపరిహారం


కేంద్ర మంత్రి ఎదుట ఎమ్మెల్యేను నిలదీస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అనారోగ్యంపాలై అకాల మృత్యువాతకు గురైన బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు చంద్రబాబు స్వయంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారని, దళారులు మేము డబ్బులు వేయించామని వస్తే ఎటువంటి డబ్బులు ఇవ్వవద్దని మైక్‌లో బాధితులకు సూచించారు. దీంతో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దళిత సంఘాలను గురించి అవహేళనగా మాట్లాడటం తగదని హితవు పలికారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని హెచ్చరించారు. దీంతో గ్రామంలోని పలు దళిత, ప్రజా సంఘాల నేతలు గతంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చులకనగా మాట్లాడిని మాటలను గుర్తు చేశారు. ఇంటికి ఒక వెయ్యి చందాలు వేసుకుని బాధిత కుటుంబాలకు ఇద్దామని గ్రామంలో ప్రజలందరి ముందు బాధిత కుటుంబాలను గురించి చులకనగా మాట్లాడాడని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఒక దళితుడై ఉండి ఆయనే దళితుల గురించి చులకనగా మాట్లాడటం అన్యాయమని అన్నారు. ఆరు నెలలుగా ఎమ్మెల్యే నియోజకవర్గంలో అకాలంగా మృత్యువాతకు గురవుతున్నా పట్టించుకోలేదని ప్రజాసంఘాలు, దళిత సంఘాలు పోరాటం చేస్తేనే ఆయన హడావుడిగా హెల్త్‌క్యాంప్‌లు, భోజనాలు, తదితరాలను ఏర్పాటు చేయటం జరిగిందని ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికార పార్టీకి చెందిన వర్గం, ప్రజా సంఘాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అరుణ్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులను అక్కడి నుంచి పంపించి వేశారు.

పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువే

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి

ప్రత్తిపాడు: పేదవాడిని ప్రపంచానికి పరిచయం చేసేది చదువేనని కేంద్ర మంత్రి పెమ్మసాని అన్నారు. పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలెంలో ప్రవాసాంధ్రుడు డాక్టర్ చిమటా యుగంధర్ ప్రసాద్, సీఎస్ఆర్ నిధులతో జెడ్పీ పాఠశాల పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు అందించారు. పాఠశాల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణలతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ అబ్బినేనిగుంటపాలెంలో 75 ఏళ్ల క్రితం దాతల సహకారంతో పాఠశాలను నిర్మించారని, ఈ పాఠశాలలో చదువుకున్న సుమారు 500 మంది ఎన్నారైలు ప్రస్తుతం విదేశాలలో ఉన్నారని చెప్పారు. ఇదే పాఠశాలలో మాజీ మంత్రి మాకినేని పెదరత్తయ్య, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, ఎన్నారై యుగంధర్ ప్రసాద్ చదివారని గుర్తు చేశారు. సొంత గ్రామంలో దేవాలయం లాంటి బడి నిర్మించేందుకు ఎన్నారై యుగంధర్ ప్రసాద్ రూ.2 కోట్లు ఇవ్వడం స్వాగతించదగిన విషయమని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో గడప దాటిన తర్వాత తల్లిదండ్రులను మర్చిపోతున్నారని, కానీ యుగంధర్ ప్రసాద్ సముద్రాలు దాటిన స్వగ్రామాన్ని మరువలేదని చెప్పారు. రాష్ట్రంలో రూ.60 వేల కోట్లతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తున్నామని, చరిత్రలో లేని విధంగా విద్యారంగంలో మార్పులు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో పెద్ద యూనివర్సిటీలలో రాజకీయ నాయకుల తొత్తులుగా ఉండేవారిని చాన్సలర్‌గా నియమించారని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం మంత్రి లోకేష్ వైస్ చాన్సలర్‌గా మంచి వారిని నియమించారని తెలిపారు. డీఎస్సీతో 16 వేల మంది టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని, ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండేలా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పొన్నూరులో కోటి సంతకాల సేకరణ

పొన్నూరు: పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయం వద్ద కల్తీ మద్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన, సాయంత్రం 5 గంటలకు చేబ్రోలు మండలంలోని శలపాడు గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు శలపాడులో వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై రచ్చబండ

చేబ్రోలు: మండలంలోని శలపాడులో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై సోమవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆళ్ల శ్రీరామిరెడ్డి ఆదివారం తెలిపారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం కూడా చేపట్టామన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు కల్తీ మద్యంపై నిరసన కార్యక్రమం

గుంటూరు రూరల్: కల్తీ మద్యం బాధ్యులపై చర్య తీసుకోవాలని ర్యాలీ, ఎక్సైజ్ కార్యాలయంలో వినతి పత్రం అందించే కార్యక్రమం సోమవారం చేపట్టినట్లు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు(పాత మల్లయపాలెం) రోడ్డులోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురు ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా సీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



ప్రత్తిపాడు: మండల పరిధిలోని కొత్తమల్లాయపాలెంలో ఆదివారం సీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. వేకువజాము నుంచే వేద పండితుల వేద మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా యంత్రపూజ, పీఠన్యాసం, గర్భన్యాసం, రత్నన్యాసంలను నిర్వహించారు. అనంతరం 9.15 గంటలకు యంత్ర బింబ ప్రతిష్ట, కళాన్యాసం, ప్రాణప్రతిష్ట, కుంభాభిషేకం చేశారు. కొల్లిపర పుట్టా స్వామి వెంకట సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తజనుల సమక్షంలో అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమంతో ప్రతిష్టా మహోత్సవాలను ముగించారు.

విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమం



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో వివిధ పంటలలో విత్తన శుద్ధి ఆవశ్యకతపై అభ్యుదయ రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆదివారం వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ కళాశాల, బాపట్ల రావెప్ విద్యార్థినులు మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసేవిధానం చూపిస్తు విత్తన శుద్ధి ఆవశ్యకతను వివరించారు. విత్తన శుద్ధి వలన లేత మొక్క దశలో వచ్చే చీడపీడలను నివారించవచ్చని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లక్ష్మీపురం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రీగీత అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో జ్వరాలు విజృంభిస్తున్నాయని, హాస్పిటల్స్ నిండా జ్వర బాధితులేన్నారు.

పీసీసీ సభ్యుల ఎన్నిక

నెహ్రూనగర్: ఏఈఎల్‌సీ నార్త్ ప్యారిస్ చర్చి పీసీసీ(ప్యారిస్ చర్చ్ కమిటీ) సభ్యుల ఎన్నిక ఆదివారం జరిగిందని బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎస్‌జే బాబూరావు తెలిపారు. 14మంది సభ్యులతో నూతన పీసీసీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. సభ్యులుగా జాలాది చిత్తరంజన్, బోరుగడ్డ రత్నాకర్, మేళం రమేష్‌కుమార్, పెండెం రతన్, పేర్లీ సందీప్, వి.పుల్లారావు, రాజేష్, సునీల్, మరియదాసు, సతీష్, ప్రేమ్‌కుమార్, సుధాకర్, దేవదానం, బాబులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

ముగిసిన చేతిరాత శిక్షణ తరగతులు


బహుమతులు అందుకున్న ఉపాధ్యాయులతో శిక్షణ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: అక్షరం అందంగా ఉంటే చూసే వారికి రాసే వారికి మనసు ఆనందంగా, ఆహ్లాదంగా ఉంటుందని మానసిక నిపుణులు చెబుతుంటారని అధ్యాపకుడు మున్నంగి సంజీవరెడ్డి తెలిపారు. రెండు రోజులుగా స్తంభాలగరువు పుల్లయ్య హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రెండో విడత ఉపాధ్యాయుల చేతిరాత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. చేతిరాత చక్కగా ఉంటే విద్యార్థులకు పరీక్షల్లో అదనపు మార్కులు రావడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వ్యక్తిగత, ప్రభుత్వ సెలవులు కూడా త్యజించి విద్యార్థుల కోసం విద్యార్థులై అందమైన రాత నేర్చుకోవటానికి జిల్లా, రాష్ట్రం దాటి వచ్చి శిక్షణ పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని, అందుకు ఎంతో మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని వారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ జాతీయ అవార్డు గ్రహీత ఉపాల రామమోహనరావు హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 35 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ ముగిసిన అనంతరం విజేతలకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి పాల్గొన్నారు.

మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు

- రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేష్ కుమార్
- విజ్ఞాన్‌లో ముగిసిన వరల్డ్ మెంటల్ హెల్త్ వారోత్సవాలు


రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటేష్ కుమార్‌ను సన్మానిస్తున్న విజ్ఞాన్ ప్రతినిధులు

చేబ్రోలు: జీవితంలో ప్రతి సారి బయటకి మార్పు కనిపించకపోయినా, మన ఆలోచన మారితే అదే నిజమైన మార్పు అని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్వ డీన్, రిటైర్డ్ ప్రొఫెసర్ జి.వెంకటేష్ కుమార్ పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన ''వరల్డ్ మెంటల్ హెల్త్ డే – 2025'' వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమాన్ని ''హీలింగ్ మైండ్స్'' అనే థీమ్‌తో నిర్వహించారు. వెంకటేష్ కుమార్ మాట్లాడుతూ మానవ మేధ మూడు స్థాయిలలో పనిచేస్తుందని స్పృహ, ఉపస్పృహ, అవచేతన ఈ స్థాయిలను అర్థం చేసుకున్నప్పుడు భావోద్వేగాలను నియంత్రించే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. మార్పులను గుర్తించగల దృష్టి కలిగి ఉండాలని పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఘటనలకు కృతజ్ఞత తెలిపే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ఆలోచనల్లో సానుకూలత పెరిగితే మనసుకు ప్రశాంతత లభిస్తుందని వివరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో 90 శాతం విద్యార్థులు సెల్‌ఫోన్‌లలో ఇరుక్కుపోయి సమయాన్ని, ఆరోగ్యాన్ని, ఆలోచనలను వృథా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అతిగా మొబైల్ వాడటం వలన శరీర ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, కళ్లకు, మెదడుకు భారం పెరుగుతోందని వివరించారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆత్మనిర్భర్ భారత్ సంకల్పమే దేశాభివృద్ధికి పునాది

గుంటూరు మెడికల్: ఆత్మనిర్భర్ భారత్ సంకల్పం కేవలం ఒక నినాదం కాదని, ప్రతి భారతీయుని జీవిత ధ్యేయంగా మారాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి అన్నారు. ఆదివారం గుంటూరు లాల్‌పురం రోడ్డు లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ''ఆత్మనిర్భర్ భారత్ జిల్లా స్థాయి కార్యశాల''లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మన రైతు స్వదేశీ ఉత్పత్తిని ప్రోత్సహిస్తేనే భారతం నిజమైన ఆత్మనిర్భర్ భారత్ అవుతుందన్నారు. విదేశీ ఉత్పత్తులపై ఆధార పడకుండా, మన భారతీయ సాంకేతికత, మన విత్తనాలు, మన యంత్రాలు, మన శ్రమ – ఇవే మన బలమని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ రాజు, బిట్రా శివన్నారాయణ, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోతుల సునీత, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, జూపూడి రంగరాజు, రాష్ట్ర ఐటీ కన్వీనర్ మకుటం శివ, పొగాకు బోర్డు చైర్మన్ సి.హెచ్.యశ్వంత్, బీజేపీ సీనియర్ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి, జిల్లా కన్వీనర్ కిష్టపాటి నారాయణరెడ్డి, కో కన్వీనర్లు మునగపాటి నాగేశ్వరరావు, పొట్టు మూర్తి శ్రీనివాస్, శ్రీమతి కొచ్చర్ల శ్రీదుర్గా, సీనియర్ నాయకులు ఈదర శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాస్, వై.వి. సుబ్బారావు, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బజరంగ్ రామకష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జీఎస్టీపై సదస్సు

నెహ్రూనగర్: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ''జీఎస్టీ 2.0 సంస్కరణలు– భవిష్యత్ ఆర్థిక ధోరణులు'' అంశంపై సోమవారం సదస్సు నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపారవేత్తలతో మధ్యాహ్నం 3 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెమినార్ ఉంటుందని చెప్పారు.

రేపు ఏసీ కాలేజీలో

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ''బిల్డింగ్ డెవలపర్స్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్'' అంశంపై క్రెడాయి, నరెడ్కో, బీఏ ఐ సభ్యులు, బిల్డర్లు, డెవలపర్లు, కాంట్రాక్టర్లు, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ సప్లయర్లు (సిమెంట్, పెయింట్స్, ఇంటీరియర్, ఎక్స్టీరియర్), హార్డ్‌వేర్ షాపులు, ఇతర సంబంధిత వ్యక్తులకు ఎగ్జిబిషన్, అవగాహన కార్యక్రమం మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఏసీ కాలేజీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని జీఎస్టీ అనుగుణ ఇన్వాయిసింగ్ విధానం, ధర పారదర్శకతను ప్రతిబింబించే విధంగా ఆయా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. స్టాల్స్ కోసం నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ రాంబాబు (98499 08390)ని సంప్రదించవచ్చని సూచించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు 0863–2224202 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కౌలు రైతులకు దక్కని భరోసా

సీసీఆర్సీ కార్డులు అందక ఇబ్బందులు


ఈ క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

పొన్నూరు: మండలంలో కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందక ఇబ్బందులు పడుతున్నారు. భూయజమానులతో సమానంగా కౌలుదారులకూ పథకాల లబ్ధిని అందించాలనే లక్ష్యంతో వ్యవసాయ శాఖ సాగుహక్కు పత్రాలు(సీసీఆర్సీ కార్డులు) మంజూరు చేస్తోంది. అన్నదాతలకు అవగాహన లేని కారణంగా చాలా మంది కౌలు రైతులు వీటిని అందుకోలేక పోతున్నారు. దీని వల్ల ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిని చాలామంది కౌలు రైతులు అందుకోలేక పోయారు. మండలంలో దాదాపు 7 వేల మంది కౌలు రైతులున్నారు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఈ లక్ష్యం పూర్తి చేయలేకపోయారు.

సహకరించని భూ యజమానులు...

నిబంధనల ప్రకారం సీసీఆర్సీ కార్డు జారీ చేయాలంటే భూ యజమాని కౌలుకు ఇచ్చినట్లు సాగుహక్కు అంగీకార పత్రం ఇవ్వాలి. భూ యజమాని సంతకంతో పాటు ఇతర వివరాలు ఇవ్వాల్సి ఉంది. కొంతమంది రైతులు వారికి సంబంధించిన భూమి వివరాలు ఇవ్వడానికి, సంతకం పెట్టడానికి ఇష్టపడటం లేదు. ఫలితంగా ప్రభుత్వ పథకాల లబ్ధితో పాటు, పంట నష్టపరిహారం కూడా లభిస్తోంది. అయితే కొందరు భూ యజమానులు అంగీకరించని కారణంగా కౌలు రైతులు ఈ క్రాప్‌కే పరిమితమవుతుందని చెప్పారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సమన్వయంతో గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం చేకూరడం లేదు. దీనికి కొంత మంది మాత్రమే అంగీకరిస్తున్నారు.

సాగుదారులు 10 వేలు మంది..

మండలంలో 28 వేలు ఎకరాల భూమిలో 10 వేల మంది సాగుదారులున్నారు. ఇందులో 3 వేల మంది సొంత భూమి సాగు చేస్తున్నవారు కాగా... దాదాపు 7 వేల మంది కౌలుదారులు ఉన్నారు. వారిలో 4500 మందికి మాత్రమే సీసీఆర్సీ కార్డులు అందించే విధంగా అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. మిగిలిన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎంత మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేశారని ఏఓ వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.

హాస్యంతో కూడిన కే ర్యాంప్



మాట్లాడుతున్న నటుడు కిరణ్ అబ్బవరం

నగరంపాలెం: ఈనెల 18న విడుదల చేయనున్న కెర్యాంప్ చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూడాలని నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. కెర్యాంప్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నటుడు కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ దీపావళి పండుగకు వస్తున్నామని, కుటుంబ సమేతంగా వెళ్తే కడుపుబ్బ నవ్వుతారని అన్నారు. మొదటి నుంచి చివరి వరకు హాస్యంతో కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటికే ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. ఇదే రీతిలో సినిమాను కుటుంబ సభ్యులతో వీక్షించాలని చెప్పారు. ఇప్పటి వరకు విడుదలైన చిత్రాలను ఆదరించిన ప్రేక్షకులు, అభిమానులకు ధన్యవాదాల అని అన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే అభిమానం చూపాలని అన్నారు.

• కొంచెం పట్టించుకోరూ..


ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫారం

నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సెంటర్‌లోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. పిల్లలు, పెద్దలు రాకపోకలు సాగించే ప్రదేశంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు బాక్సులు చేతికందే ఎత్తులో ఉన్నాయి. దీంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

–పొన్నూరు

సహ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు ఎడ్యుకేషన్: సమాచార హక్కు చట్టంపై ప్రజలందరూ అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రభుత్వ అధికారులు తమ బాధ్యతలు తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఫోరం ఫర్ ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈమని హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం లాడ్జి సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన అనంతరం ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రజలతో కలిసి అరండల్‌పేటల పోలీస్ స్టేషన్ వరకు నడిచారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజలు తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టటం కష్టతరమైన నేపథ్యంలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని హక్కుగా పొందే అవకాశాన్ని కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2005 అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టాన్ని తెచ్చిందన్నారు. ముందుగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ జేసీకి భారత రాజ్యాంగ ప్రతిని బహూకరించారు. డాక్టర్ మూకిరి సుధ పాడిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి.

ప్రత్తిపాడులో పంచాయతీ రోడ్డుకు మరమ్మతులు


యంత్రాలతో చేస్తున్న మరమ్మతులు


పంచాయతీ కార్యాలయం ఎదుట గుంతలు పూడ్చి చదును చేసిన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: రహ'దారి'ద్ర్యానికి చెక్ పడింది. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై పడిన గుంతలకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రత్తిపాడు పంచాయతీ కార్యాలయం ఎదురు ఆర్ అండ్‌బీ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీళ్లు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య కార్మికులను పురమాయించి గుంతల్లో నిలిచిన నీటినిఎత్తి కాలువల్లో పోయిస్తున్నారంటూ ఆదివారం 'సాక్షి'లో 'రహ'దారి'ద్ర్యం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుపై పడిన గుంతలకు మరమ్మతులు చేయిస్తున్నారు. అయితే ఏడాదిన్నర కాలంలో ఇప్పటికి ముచ్చటగా మూడు సార్లు మరమ్మతుల పేరుతో ఈ గోతులను పూడ్చారు. తాజాగా నాలుగోసారి కూడా అధికారులు గుంతలకు రిపేర్లు చేస్తుండటం గమనార్హం.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్

పట్నంబజారు: ఈ నెల 20వ తేదీన దీపావళిని పురస్కరించుకుని, బాణసంచా విక్రయించే వ్యాపారులు పూర్తి స్థాయిలో అన్ని అనుమతులు తీసుకోవటంతో పాటు, నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్‌అజీజ్ కోరారు. లాలాపేటలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. లైసెన్స్‌లు, సరైన అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. షాపులు, గొడౌన్‌లు ప్రజలు నివశించే ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపారు. తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ చర్యలు పాటించాలని, మైనర్లను పనిలో పెట్టుకోకూడదని, అధికారులు సూచించిన సమయాల్లోనే విక్రయాలు చేపట్టాలని సూచించారు. దీపావళి రోజు సాయంత్రం 5 గంటల తరువాత అమ్మకాలు పూర్తి నిషేధమని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వలు ఉంచితే.. వాటిని సీజ్ చేయటంతో పాటు చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమ నిల్వలు కలిగి ఉన్న వారి సమాచారాన్ని డయల్ 112, 8688831568 కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: వయోవృద్ధులు, దివ్యాంగులను ఆదరించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 12 రకాల నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది వృద్ధులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అందరూ ఉండి కూడా ఒంటరి జీవితాలు జీవిస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి ప్రతి ఒక్కరూ ఇతోధికంగా సహాయం అందించాలని చెప్పారు.

మానసిక సమస్యల్ని నిర్లక్ష్యం చేయవద్దు

గుంటూరు మెడికల్: వయసుతో నిమిత్తం లేకుండా మానసిక సమస్యలు పెరిగిపోతున్నాయని మానసిక వైద్య నిపుణులు కె.ఎల్.తేజస్విని పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ కేఎల్ తేజస్విని మాట్లాడుతూ యువతలో ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లు పెరిగిపోతున్నాయని చెప్పారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం అత్యవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే విధంగా పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ వయస్సు, ఎత్తును బట్టి శరీర బరువును కలిగి ఉండడం, ఆహార నియమాలు, శారీరక వ్యాయామం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ నేటి సమాజంలో అత్యధిక శాతం మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గాజుల లక్ష్మీనారాయణ, డాక్టర్ టి.చంద్రశేఖర్ రెడ్డి, తూబాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.